క్లుప్తంగా

రెండు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

కారేపల్లి: మండలంలోని వేర్వేరు చోట్ల గురువారం రాత్రి జరిగిన ప్రమాదాల్లో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. కామేపల్లి మండలం అడవి మద్దులపల్లికి చెందిన వీరబాబు, లాల్యా ద్విచక్రవాహనంపై గురువారం రాత్రి కోటమైసమ్మతల్లి జాతరకు వెళ్లి వస్తుండగా కారేపల్లి మండలం గాంధీనగర్ రైల్వే గేటు వద్ద ద్విచక్రవాహనం అదుపు తప్పి కిందపడ్డారు. దీంతో వీరిద్దరికి తీవ్రగాయాలయ్యాయి. అలాగే, టేకులపల్లి మండలం కోయగూడెం నుంచి కారేపల్లి క్రాస్ వైపు వస్తున్న ఆటోను ఎదురుగా వచ్చిన కారు కారేపల్లి పెట్రోల్ బంక్ వద్ద ఢీకొట్టింది. ఈ ఘటనలో అదుపు తప్పిన ఆటో రోడ్డు పక్కన నడిచి వెళ్తున్న కారేపల్లి చర్చి కాలనీకి చెందిన కుసుమూరి కాంతమ్మను ఢీకొట్టింది. దీంతో ఆమెకు తీవ్ర గాయాలు ఆస్పత్రికి తరలించారు.

మృతదేహంతో ఆందోళన

కారేపల్లి: కారు ఢీకొనడంతో మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి పరిహారం చెల్లించాలనే డిమాండ్‌తో మృతదేహంతో కారు యజమాని ఇంటి ఎదుట ఆందోళనకు దిగారు. మండలంలోని పేరుపల్లికి చెందిన సిరికొండ కృష్ణ బుధవారం ద్విచక్రవాహనంపై వస్తుండగా, రావోజీతండా మూలమలుపు వద్ద కారు ఢీకొనడంతో మృతి చెందాడు. ఈమేరకు పేరుపల్లికి చుట్టపుచూపుగా వచ్చిన మన్నె వెంకటేశ్వర్లు బంధువు కారే కారణమైనందున పరిహారం చెల్లించాలని ఆయన ఇంటి ఎదుట మృతదేహంతో కుటుంబీకులు ఆందోళనకు దిగారు. దీంతో గ్రామపెద్దలు చర్చించడంతో ఆందోళన విరమించారు.

స్వాతంత్య్ర సమరయోధుడు మృతి


తిరుపయ్య (ఫైల్)

చింతకాని: మండలంలోని ప్రొద్దుటూరుకు చెందిన స్వాతంత్య్ర సమరయోధుడు బొమ్మినేని తిరుపయ్య (98) గురువారం మృతి చెందాడు. కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన చికిత్స పొందుతూ కన్నుమూశారు. తిరుపయ్యకు భార్య, ఇద్దరు కుమారులు ఉండగా, ఆయన మృతిపై వివిధ పార్టీల నాయకులు, అధికారులు సంతాపం తెలిపారు.

కాంగ్రెస్‌కు మాజీ సర్పంచ్ రాజీనామా

కారేపల్లి: కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసినట్లు సింగరేణి మాజీ సర్పంచ్ ఆదెర్ల స్రవంతి ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని కాంగ్రెస్ పార్టీలో వర్గ విబేధాలు, కార్యకర్తలకు సరైన గుర్తింపు దక్కకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఓ ప్రకటనలో వెల్లడించారు. సర్పంచ్‌గా పని చేసిన తనకు పార్టీలో గుర్తింపు ఇవ్వకపోగా, పార్టీ కార్యక్రమాలకు కూడా ఆహ్వానించడం లేదని వాపోయారు.



కౌలు ధరలు పైపైకి..

- ఆగ, మగ మొక్కజొన్న సాగుపై రైతుల ఆసక్తి
- ఫలితంగా కౌలు ధరలపై ప్రభావం
- ఎకరాకు రూ.30 వేలకు పైగానే..

కొణిజర్ల: ఆడ, మగ రకం మొక్కజొన్న సాగుకు రైతులు ఆసక్తి చూపుతుండడం, కంపెనీ బాధ్యులే రైతులకు ఎకరానికి రూ.10 వేల నుంచి రూ.50 వేల వరకు పెట్టుబడి సాయం అందిస్తుండడంతో పలువురు ముందుకొస్తున్నారు. భూమి ఉన్న రైతులే కాక భూమి లేని వారు కూడా ఆసక్తి కనబరుస్తూ కౌలుకు తీసుకునేందుకు యత్నిస్తున్నారు. ఈక్రమాన కౌలు ధరలు ఏటేటా పెరుగుతున్నాయి. రెండేళ్ల క్రితం ఎకరం రూ.10 వేలకు ఇస్తామన్నా తీసుకోవడానికి ముందుకు రాని రైతులు ప్రస్తుతం ఎకరానికి రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకైనా చెల్లిస్తుండడం గమనార్హం. ఈసారి కూడా యాసంగి సీజన్‌లో పంట సాగుకు ముందస్తుగానే రైతులు కౌలు ఖరారు చేసుకుంటున్నారు.

యాసంగికి సిద్ధం

కొణిజర్ల మండలంలో లాలాపురం, సింగరాయపాలెం, గుండ్రాతిమడుగు, మెకాలకుంట, లక్ష్మీపురం సాలెబంజర, రాంపురం, రామచంద్రాపురం, మల్లుపల్లి, రామనరసయ్యనగర్ తదితర గ్రామాల్లో రైతులు ఏటా యాసంగి పంటగా మొక్కజొన్న సాగు చేయడం ఆనవాయితీ. అయితే, నాలుగైదేళ్లుగా సంప్రదాయ పద్ధతిలో కాకుండా ఆడ, మగ రకం మొక్కజొన్న సాగు చేస్తున్నారు. సింగరాయపాలెం, లాలాపురం, తీగలబంజరకు చెందిన కొందరు మధ్యవర్తులుగా ఉండి కంపెనీల నుంచి రైతులకు పెట్టుబడి సాయం కింద ఎకరాకు రూ.10వేల నుంచి రూ.50 వేల వరకు ఇప్పిస్తున్నారు. సాగు కాలమంతా కంపెనీ ప్రతినిధులు, మధ్యవర్తులే అవగాహన కల్పిస్తున్నారు. ఎకరాకు సుమారు 30క్వింటాళ్లకు పైగా దిగుబడి వస్తుండడం, కంకులు క్వింటాకు రూ.3,200 నుంచి రూ.4,500 వరకు ధర పలుకుతుండడంతో రైతులకు సుమారు రూ.2లక్షల పైగానే మిగులుతున్నాయి. దీంతో రైతులు ఎంత కౌలు చెల్లించడానికైనా వెనకాడడం లేదు. మండలంలోని మెకాలకుంట, లక్ష్మీపురం, సాలెబంజర, తీగలబంజర తదితర గ్రామాల రైతులు చిన్నమునగాల, కొండవనమాల, దిద్దుపూడి గ్రామాలతో పాటు వైరా మండలం పాలడుగు, గొల్లపూడి, సిరిపురం ఏన్కూరు మండలం కేసుపల్లి వరకు వెళ్లి భూమి కౌలుకు తీసుకుంటుండడంతో కౌలు రేట్లు పెరుగుతున్నాయి. దీంతో సాగు చేసే వారికే కాక భూయజమానులకు కూడా ఫలితం దక్కుతోందని చెబుతున్నారు. కాగా, యాసంగిలో మొక్కజొన్న సాగు చేసే వారు ఇప్పటి నుంచి భూముల కౌలు మాట్లాడుకుంటున్నారు. అయితే, ఎలాంటి మోసాలు జరగకుండా రైతులు కంపెనీల బాధ్యులతో సరైన అగ్రిమెంట్ చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

11ఎకరాల్లో పంట సాగు



ఎకరానికి రూ.30వేల చొప్పున చెల్లిస్తూ 11ఎకరాలు కౌలుకు తీసుకున్నా. గతేడాది ఆడ, మగ రకం మొక్కజొన్న వేస్తే కంపెనీ వారి సూచనలతో దిగుబడి, మద్దతు ధర దక్కింది. ఖర్చులు పోగా డబ్బులు మిగిలాయి. ఈసారి కూడా అదే ఆశతో కౌలుకు తీసుకున్నా.

– భూక్యా వాల్యా, మెకాలకుంట, కొణిజర్ల

ఐదెకరాలు కౌలుకు ఇచ్చా...



వయోభారం వల్ల పొలం పనులు చేయలేని పరిస్థితి ఉంది. దీంతో నాకు ఉన్న పొలం కౌలుకు ఇచ్చాను. కౌలు సగం ముందుగా, మిగిలిన సగం పంట అమ్మగానే కడుతున్నారు. కౌలుతో పాటు రైతు భరోసా వస్తోంది. ఇది గ్రామాల్లో మాలాంటి రైతులకు కలిసొస్తోంది.

– గుగులోత్ వెంకట్రాములు, లక్ష్మీపురం

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కండి..

మండలాల్లో పార్టీ నేతల సమావేశాలు

సత్తుపల్లి: స్థానిక సంస్థల ఎన్నికలకు కాంగ్రెస్ శ్రేణులు సిద్ధం కావాలని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ సూచించారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం సత్తుపల్లి, కల్లూరు, తల్లాడ మండలాల నాయకులతో సమావేశమైన ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రతీ కాంగ్రెస్ కార్యకర్తలు సైనికులుగా పని చేయాలని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యాన అమలవుతున్న పథకాలను ప్రజలకు వివరిస్తూ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని చెప్పారు.

- కల్లూరు: స్థానిక సంస్థల ఎన్నికలలో బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించుకోవాలని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య కోరారు. కల్లూరులో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను విస్మరించిన విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తే గెలుపు సులువవుతుందని తెలిపారు. పార్టీ కల్లూరు మండల అధ్యక్షుడు పాలెపు రామారావుతో పాటు కట్టా అజయ్‌కుమార్, డాక్టర్ లక్కినేని రఘు, మేకల కృష్ణ, బీరవల్లి రఘు, బొబొలు లక్ష్మణరావు, పెడకంటి రామకృష్ణ, కొరకొప్పు ప్రసాద్, సీహెచ్.కిరణ్ పాల్గొన్నారు.
- చింతకాని: స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాల్లో గెలిచేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని సూచించారు. చింతకాని మండలం రామకృష్ణాపురంలో శుక్రవారం రాత్రి జరిగిన సమావేశంలో బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన 65 కుటుంబాలు కాంగ్రెస్‌లో చేరగా ఆమె మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, భట్టి విక్రమార్క చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరుతున్నారని తెలిపారు. ఇదేస్ఫూర్తితో ఎన్నికల్లో విజయానికి కృషి చేయాలన్నారు.మత్కే పల్లి మార్కెట్ చైర్మన్ అంబటి వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ నాయకులు కన్నెబోయిన గోపి, మడుపల్లి భాస్కర్, కూరపాటి కిషోర్, కొప్పుల గోవిందరావు, బందెల నాగార్జు తదితరులు పాల్గొన్నారు.
- ఎర్రుపాలెం/చింతకాని: బీజేపీ శ్రేణులు స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని పార్టీ మధిర నియోజకవర్గ ఇంచార్జి ఏలూరి నాగేశ్వరరావు సూచించారు. ఎర్రుపాలెం మండలం రేమిడిచర్లలో బీజేపీ మండల అధ్యక్షుడు కొమ్మినేని కృష్ణారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గెలిచే అవకాశం ఉన్న వారినే ఎంపిక చేయాలని తెలిపారు. కాగా, చింతకాని జరిగిన బీజేపీ శ్రేణుల సమావేశంలో మండల అధ్యక్షుడు కొండా గోపి మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీలో ఉండనున్నందున అభ్యర్థులు సిద్ధం కావాలని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ అభ్యర్థులు గెలుపు లక్ష్యంగా పాటుపడాలని సూచించారు. నాయకులు చిలివేరు సాంబశివరావు, కోటేశ్వరరావు, నూతక్కి నరసింహారావు, అనుమోలు సురేష్, మద్దినేని వెంకటేశ్వరరావు, గోదా మంగయ్య, అనగాని రామారావు తదితరులు పాల్గొన్నారు.
- కొణిజర్ల/ఏన్కూరు: స్థానిక సంస్థల ఎన్నికలలో సీపీఐకి బలమున్న చోట పోటీ చేయనుండగా, పార్టీ అభ్యర్థుల విజయానికి శ్రేణులు కృషి చేయాలని జిల్లా సమితి సభ్యులు యర్రా బాబు, దొండపాటి రమేష్ సూచించారు. కొణిజర్లలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ పార్టీ బలపర్చిన అభ్యర్థులను గెలిపించడానికి కార్యకర్తలు పాటుపడాలని తెలిపారు. ఇక ఏన్కూరులో నిర్వహించిన సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి జాగర్లమూడి రంజిత్‌కుమార్ పార్టీశ్రేణులకు పోటీపై దిశానిర్దేశం చేశారు. నాయకులు కార్యదర్శి గడల భాస్కర్, స్వర్ణ రమేష్, మునిగే కోటేశ్వరరావు, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, తెప్పల సత్యం, అమరనేని వీరభద్రం, బోగినబోయిన నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



వైద్య కళాశాలకు మృతదేహం అప్పగింత

మధిర: మధిర సుందరయ్య నగర్‌కు చెందిన విశ్రాంత ఉపాధ్యాయులు పారుపల్లి వెంకటకృష్ణారావు సతీమణి, విశ్రాంత ఉపాధ్యాయిని విమల ఈనెల 1న మృతి చెందారు. ఆమె నేత్రాలను తెలంగాణ నేత్ర, అవయవ, శరీర దాతల సంఘం బాధ్యులు మాధవరపు నాగేశ్వరరావు, గంజి ఈశ్వరలింగం ద్వారా సేకరించి ఖమ్మం నేత్రనిధికి అందజేశారు. అలాగే, మృతదేహాన్ని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని నీలిమ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌కు గురువారం అప్పగించారు. ఈ సందర్భంగా సంఘం బాధ్యులు మాట్లాడుతూ విమల నేత్రాల ద్వారా ఇద్దరు అంధులకు చూపు దక్కనుండగా, ఆమె మృతదేహం వైద్య విద్యార్థుల బోధన అవసరాలకు ఉపయోగపడుతుందని తెలిపారు. ఆమె భర్త కృష్ణారావు, కుమారులు వేణుగోపాల్, విజయ్ కుమార్ పాల్గొన్నారు.


విమల కుటుంబీకులకు సర్టిఫికెట్ ఇస్తున్న నాగేశ్వరరావు

భట్టిని కలిసిన బీఆర్‌ఎస్ మండల మాజీ అధ్యక్షుడు

చింతకాని: బీఆర్‌ఎస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్య శుక్రవారం బోనకల్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిశారు. కాంగ్రెస్‌లో చేరాలని నిర్ణయించుకున్న ఆయన ఇటీవల బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేశారు. ఈనేపథ్యాన భట్టిని కలవగా6వ తేదీన చింతకానిలో తన అనుచరులతో కలిసి కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తుడుం రాజేష్, తుళ్లూరు అచ్చయ్య, తుడుం కృష్ణ, చల్లా శంబులింగం, నున్నా నాగయ్య, గుర్రం శ్రీనివాసరావు, పులి శ్రీనివాసరావు పాల్గొన్నారు.


భట్టి విక్రమార్కతో పుల్లయ్య, తదితరులు

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత


ర్యాలీలో రేంజర్ స్నేహలత, ఉద్యోగులు

సత్తుపల్లిటౌన్: వన్యప్రాణులను సంరక్షించడాన్ని అందరూ బాధ్యతగా భావించాలని సత్తుపల్లి రేంజర్ పి.స్నేహలత సూచించారు. గురువారం వన్యప్రాణుల సంరక్షణ వారోత్సవాల సందర్భంగా గురువారం సత్తుపల్లిలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వన్యప్రాణులను వేటాడితే కఠిన శిక్ష ఉంటుందని తెలిపారు. ఈకార్యక్రమంలో అటవీశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ విద్యార్థికి ల్యాప్‌టాప్



వైరా: వైరాకు చెందిన గుడిపూడి రాహుల్ దేవ్ జేఎన్‌టీయూలో సీటు సాధించగా వైరా గ్రేట్ విజన్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యాన గురువారం ల్యాప్‌టాప్ వితరణగా అందజేశారు. లయన్స్ క్లబ్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ, సభ్యులు గంగవరపు కిషన్‌రాయ్, తోటకూర శ్రీకాంత్, ఉయ్యూరి రామకృష్ణ, లాలూ పాల్గొన్నారు.

ఘనంగా గాంధీ జయంతి


సత్తుపల్లిరూరల్: గంగారం బెటాలియన్‌లో గాంధీ చిత్రపటం వద్ద కమాండెంట్ పెదబాబు, ఉద్యోగులు


చింతకాని : గాంధీజీ విగ్రహానికి నివాళి..


వైరా : గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మహాత్మాగాంధీ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, పార్టీల కార్యాలయాల్లో గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అలాగే, ఆయన విగ్రహాల పూలమాలలు వేసి స్వాతంత్య్ర సాధనలో గాంధీ సేవలను గుర్తు చేసుకున్నారు. అంతేకాక మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటాల వద్ద కూడా నివాళులర్పించారు.

– సాక్షి నెట్‌వర్క్

జాతి గౌరవాన్ని నిలబెట్టాలి

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: సమాజం అభివృద్ధి చెందాలంటే అందరూ కలసికట్టుగా ముందుకు రావాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఖమ్మంలో గురువారం జరిగిన కమ్మ మహాజన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సభకు ముందు మంత్రి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పరుచూరి వెంకటేశ్వరరావు, స్వతంత్య్ర లక్ష్మి దంపతులు స్కిల్ సెంటర్ నిర్మాణానికి రూ.40 లక్షల విరాళం అందించడం అభినందనీయమని, ఆ నిధులను పారదర్శకంగా వినియోగించి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఉపయోగపడేలా చూడాలని ఆయన సూచించారు. ఇటీవల గ్రూప్–1 ఫలితాల్లో విజయం సాధించిన అభ్యర్థులను తుమ్మల నాగేశ్వరరావు సన్మానించారు. అనంతరం ఎమ్మెల్సీ తాతా మధు, టీజీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు, మేయర్ పునుకొల్లు నీరజ, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు మాట్లాడారు. కమ్మ మహాజన సంఘం అధ్యక్షుడు కొల్లు రఘు సత్యనారాయణ, కార్యదర్శి చావా రాము, ఉపాధ్యక్షుడు కర్నాటి రమాదేవితో పాటు వి.శ్రీనివాసరావు, నిర్మలా కుమారి, సత్యనారాయణ పాల్గొన్నారు.

వేడుకగా దసరా

- పలుచోట్ల రావణ ప్రతిమల దహనం, జమ్మిపూజ
- కొనసాగిన అమ్మవారి విగ్రహాల నిమజ్జనం


మహిళలతో కలిసి కోలాటం ఆడుతున్న వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్


బోనకల్ : దుర్గామాత శోభాయాత్ర


చింతకాని : మత్కేపల్లిలో శ్రీ సీతారామచంద్ర స్వామి ఊరేగింపు

దసరా పర్వదినాన్ని ఊరూవాడ ఘనంగా జరుపుకున్నారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారు పండుగ సందర్భంగా స్వస్థలాలకు చేరి కుటుంబాలతో ఆనందంగా గడిపారు. రావణుడి ప్రతిమను దహనం చేయడంతో పాటు జమ్మి పూజ, ఆలయాల్లో పూజలకు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. అలాగే, తొమ్మిది రోజుల పాటు పూజలు అందుకున్న అమ్మ వారి ప్రతిమలను నిమజ్జనం చేశారు. కాగా, కొన్ని చోట్ల బతుకమ్మ వేడుకలు కొనసాగాయి. – సాక్షి నెట్‌వర్క్


కొణిజర్ల : గుబ్బగుర్తిలో బలి పూజలు నిర్వహిస్తున్న స్థానికులు


ఏన్కూరు : రూ.60వేలకు లడ్డూ దక్కించుకున్న దక్కించుకున్న మహిళలకు సత్కారం


వైరా : రావణ దహనం నిర్వహిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు


కొణిజర్ల : వేడుకల్లో కళాకారుల ప్రదర్శన


తల్లాడ : కోట మైసమ్మ ఆలయంలో కిక్కిరిసిన భక్తులు


సత్తుపల్లిరూరల్ : దీక్ష విరమణకు వెళ్తున్న భక్తులు


ఎర్రుపాలెం : తక్కెళ్లపాడులో బతుకమ్మలతో యువతులు


ముదిగొండ : పోలీస్ స్టేషన్‌లో ఆయుధ పూజ చేస్తున్న సీఐ మురళి


సత్తుపల్లిటౌన్: రావణుడి ప్రతిమకు బాణం ఎక్కుపెట్టిన ఏసీపీ రఘు